ఈటల రాజేందర్‌ను గెలిపించాలి



ఈటల సమక్షంలో పార్టీలో చేరుతున్న సోమారం గ్రామ నాయకులు



సభకు తరలివెళ్తున్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నాయకులు



ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన భోగారం గ్రామానికి చెందిన నేతలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, విక్రం, సందీప్, రాంచంద్రారెడ్డి, సత్యానారయనరెడ్డి ,ఎంఆర్‌పీఎస్ నాయకులు పరుశరాం , బాలనర్సింహ్మా, తదితరులు పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా ఇంటర్, పదవతరగతిలలో మెరుగైన ఫలితాలను కిష్టాపూర్‌కు చెందిన విద్యార్థులను సన్మానించారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. మున్సిపల్ పార్టీ అధ్యక్షులు హనుమాన్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, నాయకులకు జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ప్రదీప్‌గౌడ్, మురళీగౌడ్, ప్రవీణ్, ఆంజనేయులు,సోని,మమత, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

మేడ్చల్‌రూరల్: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. గ్రామానికి చెందిన పుష్పలత, విశ్వశాంతి, కొండల్‌రెడ్డి తదితరులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, మండలాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, శైలజహరినాథ్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అమిషా సభకు తరలిన నాయకులు

నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న అమిత్ షా సభకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నుంచి అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో కౌన్సిలర్లు సరస్వతి, మల్లిఖార్జున్ ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కీసర: కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి -సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు, నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కొలి చెలిమికృష్ణ ఆధ్వర్యంలో భోగారం గ్రామానికి చెందిన నాయకులు బీజేపీలో చేరారు. వారికి ఈటల రాజేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుంకరి భాగ్యమ్మ, కాటం మల్లేష్ యాదవ్, పడమటిరాజిరెడ్డి, దోమల మహేందర్ యాదవ్, కల్వగురిశ్రీకాంత్, గన్నోర్ల నాగరాజు, రాజు, బాలరాజు, సతీష్, రమేష్,నాగిరెడ్డి, పద్మ, గడ్డం కుమార్, బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంతనాలు... ప్రలోభాలు



ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ నేతల్లో హైరానా

- విజయానికి దోహదపడే ప్రతి అంశంపై అభ్యర్థుల దృష్టి
- ఓట్ల కోసం.. సంఘాలకు హామీలు
- గంప గుత్త ఓట్లపై ప్రత్యేక నజర్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల్లో హైరానా కనబడుతోంది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ, ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే పోటీ తీవ్రంగా ఉండటంతో.. ఓటమి తమ దరి చేరనివ్వకుండా విజయానికి దోహదపడే అన్ని అంశాలపై అభ్యర్థులు దృష్టి సారిస్తున్నారు. సంఘాలకు సామాజిక భవనాలు, ఇతర బస్తీలు ,మురికి వాడల ప్రాంతాల్లో రోడ్లు, మరమ్మతులు తదితరాలకు హామీలిస్తూనే... ఓట్లను గంపగుత్తగా తమకు దక్కేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు బస్తీలు, గ్రామాల్లో ప్రచారంతో పాటు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ ఎన్నికల్లో అవతలి పక్షం నుంచి నేతలు, కార్యకర్తలను రప్పించేందుకు నానా తంటాలు పడుతున్నారు. దీంతో తమ వారు జారిపోకుండా కాపాడుకోవడం కష్టంగా మారుతోంది. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ ఫిరాయింపులూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రచారం కంటే.. లోలోన మంతనాలు..ప్రలోభాల జోరు ఎక్కువగా జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

వ్యూహాలు.. ప్రతి వ్యూహాలు..

పార్టీల అభ్యర్థులు నియోజకవర్గం పరిధిలో కొన్ని ప్రధాన సామాజిక వర్గాలను, సంఘాలను ఆకర్షించేలా విందులు ఏర్పాటు చేస్తూనే ..ఆత్మీయ సమ్మేళనాల పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.ఎన్నికల అధికారులు కన్ను పడకుండా ఉత్తుత్తి వేడుకలు, ఇతర కార్యక్రమాల పేరిట అనువైన ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాల్లో వేడుకలు ఏర్పాటు చేసి మందు. విందులను అందిస్తున్నారు. దీంతో ఈ రోజు ఒక పార్టీలో కనిపించిన వారు మరుసటి రోజు మరో పార్టీలో దర్శనమిస్తున్నారు. సీనియర్లు పార్టీ మారుతుండగా, క్షేత్రస్థాయి కార్యకర్తలైతే ఏ పార్టీలో కొనసాగుతున్నారనేది అంతు చిక్కడం లేదు.

అసంతృప్తులపై కన్ను..

ప్రధాన పార్టీలకు చెందిన కొందరు అభ్యర్థులు ఇతర పార్టీ అసంతృప్తి నేతలపై కన్నేశారు. రహస్యంగా వారిని కలిసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తమ పార్టీలోకి రావాలని కోరుతున్నారు. ఒకవేళ పార్టీలోకి రావడం కుదరదంటే అంతర్గతంగా మద్దతివ్వాలని, క్రాస్ ఓటింగు సహకరిస్తే కావాల్సిన సాయం చేస్తామని హామీలిస్తున్నారు. అవసరమైతే ప్రత్యేకంగా ప్యాకేజీలు అందిస్తున్నారు. దీనికి తోడు ద్వితీయ శ్రేణి నుంచి దిగువస్థాయి వరకు ఉన్న ప్రధాన నాయకులు, ముఖ్యమైన కార్యకర్తలకు ప్రచారం చేసేందుకు వాహనాలను సమకూర్చుతున్నారు. కొన్ని చోట్ల ప్రధాన వర్గాలను ఆకట్టుకునేలా నగదు ఇస్తామని, ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు, ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా బహుమతులను పంపిస్తామన్న ప్రచారం జోరందుకుంటోంది. ప్రధానంగా మహిళా, యువజన సంఘాలు, వెల్ఫేర్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్టుమెంట్, కాలనీ కమిటీల తోసహా ఓట్లను ప్రభావితం చేసే వారిపై పార్టీలు దృష్టి సారించాయి.ప్రధాన పార్టీల వ్యూహా ప్రతి వ్యూహాలు తమ అభ్యర్థుల గెలుపు ఓటములపై ఎంతమేరకు ప్రభావం చూపుతాయోనన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

ముమ్మరంగా బీఆర్ఎస్ ప్రచారం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో రెండవ వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కారు గుర్తుకే ఓటు వేయాలంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 2వ వార్డు అధ్యక్షుడు జనగామ యాదగిరి రావు, మాజీ సర్పంచ్ వడ్లకొండ స్టీవెన్, మాజీ వార్డు సభ్యులు వడ్లకొండ శివయ్య, శివరామచంద్రం, బండాల ప్రేమలత, పందిరి శశికళ, మాధవి తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



ప్రచారం చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, తదితరులు



కీసర: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం కీసరలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సునీతా మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్మన్‌గా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన సునీతమ్మను ఎంపీగా గెలిపించుకొని సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలపై ప్రచారాన్ని కొనసాగించారు. నాగారం దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌నేతలు ప్రచారం నిర్వహించారు.నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నాగారం మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, వరింగ్ ప్రెసిడెంట్ నల్లోలకుమార్, కీసర మండలపార్టీ అధ్యక్షుడు కోలకృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు తటాకం వెంకటేష్, యూత్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని వివిధ కాలనీల్లో పట్టణ కాంగ్రెస్ నాయకులు ,అత్వెల్లిలో గ్రామ నాయకులు ఆదివారం జోరుగా ప్రచారం నిర్వహించారు. కాలనీలలో, బస్తీలలో పాదయాత్రలు చేసి ఇంటింటికి వెళ్లి ఓటడిగారు. ప్రచారంలో నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి,వైస్ చైర్మన్ రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారయణ, మధుకర్‌యాదవ్, రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్, నారెడ్డి రవిందర్‌రెడ్డి, వీరమల్ల శ్రవణ్‌కుమార్‌గుప్తా, లింగం, శంకర్,పవన్‌కుమార్, సీపీఎం నాయకుడు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చీర్యాల లక్ష్మీనరసింహ స్వామి

తిరుకల్యాణోత్సవం



కీసర : చీర్యాల లక్ష్మీనరసింహ స్వామి షోడశ(16వ)వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీస్వామివారి తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నరసింహ్మాచార్యుల పర్యవేక్షణలో ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుదీర్చి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేడకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ, అండ్ స్టాంప్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఆలయ చైర్మన్ మాల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు శ్రీవారికి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

స్వామి సేవలో ప్రముఖులు..









చీర్యాల లక్ష్మీనరసింహ్మస్వామి వార్షికోత్సవాల్లో బాగంగా స్వామివారి రాష్ట్ర మంత్రి కొమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్, రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ రాజ్‌ఠాకూర్, మాజీ ఐఏఎస్ అధికారి ఎం.వీ.రెడ్డి.మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వామి దర్శనాంతరం వేదపండితులు వారికి స్వామివారి ఆశీస్సులను, ప్రసాదాలను అందజేశారు.

నేడు ఉత్సవ సమాప్తి..

చీర్యాల లక్ష్మీనరసింహ్మ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగియనున్నాయి. శత ఘటాభిషేకం, అలంకరణ, పంచహారతులు, నివేదన, శాతుమర్రై, చక్రస్నానం, తీర్థప్రసాద గోష్టి, సాముహిక శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం, రుత్విక్ సన్మానం, మంగళశాసనం, స్వామివారి పల్లకీ సేవ, పవళింపుసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రూ. 5 లక్షల నగదు పట్టివేత

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు అటుగా వెళుతున్న కారును ఆపి సోదా చేయగా రూ. 5 లక్షల నగదు లభ్యమైంది. నగదు తీసుకెళ్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్‌కు చెందిన పెద్ది శ్రీనివాస్‌గా గుర్తించారు. నగదుకు సంబంధిచి ఆధారాలు చూపకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగించారు.